

విధానసౌధ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సీఎం, డీసీఎం

## మహాత్ముడి ఆశయ సాధనకు పాటుపడాలి

-సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): మహాత్ముడి ఆశయాలకోసం అందరూ పాటుపడాలని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. బుధవారం గాంధీజయంతిని పురస్కరించుకుని సీఎం, డీసీఎంతోపాటు మంత్రులు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కుమారకృపరోడ్డులోని గాంధీ భవన్ నుంచి విధానసౌధకు పాదయాత్ర ప్రారంభించే సమయంలో సీఎం మాట్లాడుతూ మహాత్ముడి ఆశయాలకోసం అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. పాదయాత్రలో వేలాదిమంది పాల్గొన్నారు. విధానసౌధలో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రికి నివాళులర్పించారు. అనంతరం విధానసౌధ బ్యాంకెట్ హాల్‌లో బీబీఎంపీ ఏర్పాటు చేసిన స్వచ్ఛతా అభియాన, ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మహాత్మాగాంధీ తొలుత గ్రామీణ భారతాన్ని అభివృద్ధి చేయాలని భావించారన్నారు. బ్రిటీష్‌వారిపై నిరంతరంగా అహింసతో పోరాటాలు చేసిన మహనీయుడన్నారు. సమసమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు హెచ్‌కే పాటిల్, లక్ష్మీ హెబ్బాళ్కర్, మాజీ సీఎం వీరప్పమొయిలీతోపాటు చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ పాల్గొన్నారు. కర్ణాటక గాంధీ స్మారకనిధి సంస్థ గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు సమాజసేవకులను సత్కరించారు.

### ఆత్మసాక్షే అత్యున్నత న్యాయస్థానం

ఆత్మసాక్షి అత్యున్నతమైన న్యాయస్థానమని సీఎం సిద్దరామయ్య అన్నారు. ఆత్మసాక్షికి తగ్గట్టుగా నడుచుకోవాలని సూచించారు. ఎవరైనా పొగడనీ, దూషించనీ లక్ష్యసాధనతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. గాంధీజీ పోరాటంతో మనకు స్వాతంత్ర్యం లభించిందన్నారు.

### గాంధీజీని హత్య చేశారు... ఆశయాలను కాదు..

గాంధీని హత్య చేశారని కానీ ఆయన ఆశయాలను హతమార్చడం అసాధ్యమని సీఎం అన్నారు. కేపీసీసీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ బీజేపీ వారికి గాడ్సే నాయకుడని, గాడ్సేభారత్‌ను చేసేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందన్నారు. మహాత్మాగాంధీ బెళగావిలో జరిగిన కాంగ్రెస్ సభలో పాల్గొనడం చారిత్రాత్మకమన్నారు. మతతత్వ శక్తులకు అవకాశం ఇవ్వరాదన్నారు. కాంగ్రెస్ ద్వారా దేశం ఎంతో ప్రగతి సాధించిందన్నారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు జాతీయ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చారని, అన్నభాగ్య వంటి పథకాలు అమలు చేశారన్నారు. కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, మంత్రి హెచ్‌కే పాటిల్, మాజీ మంత్రులు, కేపీసీసీ పదాధికారులు పాల్గొన్నారు.

### దేశభక్తికి మారుపేరు రాణిచన్నమ్మ

దేశభక్తి, స్వాభిమానానికి కిత్తూరు రాణిచన్నమ్మ మరోపేరు అని సీఎం పేర్కొన్నారు. కిత్తూరు విజయోత్సవ జ్యోతిని సీఎం విధానసౌధ ప్రాంగణంలో లాంఛనంగా ప్రారంభించారు. జ్యోతిరథం అన్ని జిల్లాల్లో తిరిగి కిత్తూరుకు చేరుకోనుంది. దేశభక్తితో బ్రిటీష్‌వారిపై పోరాటం సాగించారని కొనియాడారు.



ర్యాలీ చేస్తున్న సీఎం, డీసీఎం తదితరులు

## స్నేహమయికృష్ణకు ఈడీ సమన్లు

బెంగళూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ముడా వివాదంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. బుధవారం ముడా వివాదానికి సంబంధించి ఫిర్యాదుదారుల్లో ఒకరైన స్నేహమయికృష్ణకు ఈడీ సమన్లు జారీ చేసింది. గురువారం ఉదయం 11 గంటలకు బెంగళూరు ఈడీ కార్యాలయానికి సాక్ష్యాధారాలతో హాజరు కావాలని మెయిల్ ద్వారా సమన్లు పంపారు. ఇదే విషయాన్ని స్నేహమయికృష్ణ మీడియాకు తెలిపారు.

# అయోమయం..!

### ప్రారంభంకాని విద్యాసంవత్సరం
### దిక్కుతోచని స్థితిలో డిగ్రీ విద్యార్థులు
### తేలని అధ్యాపకుల నియామకాలు
### ఆరు నెలలుగా కళాశాలలకు వెళ్లి వస్తున్న వైనం



నగరంలోని ఓ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

బెంగళూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో ఫిబ్రవరి నుంచి మార్చిలోగా తరగతి ఏదైనా పరీక్షలు ముగుస్తాయి. ఆ తర్వాత నెలరోజులు అటు ఇటుగా ఫలితాలు ప్రకటిస్తారు. ఉత్తీర్ణులైనవారు కోర్సులు, కళాశాలల ఎంపిక ప్రక్రియ నెలలోపే ముగుస్తుంది. ఇలా ప్రతి ఏటా ప్రాథమిక పాఠశాలల నుంచి డిగ్రీ దాకా మే చివరి నుంచి జూన్ ఆరంభం నాటికి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కావాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రంలో ఉన్నత విద్యావిభాగం చొరవచూపని కారణంతో డిగ్రీలో చేరిన విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారింది. ఈ ఏడాది ఏప్రిల్ 10న ద్వితీయ పీయూసీ ఫలితాలు ప్రకటించారు. సాధారణంగా డిగ్రీ కళాశాలలు జూన్ ఆరంభంలోనే ప్రారంభమవుతాయి. ఆరు నెలలు కావస్తున్నా రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో విద్యా సంవత్సరం ఆరంభం కాలేదు. కోర్సుల్లో చేరినవారు ఎప్పటి నుంచి కళాశాలలకు వెళ్లాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. రాష్ట్రంలో సెప్టెంబరు చివరివారంలో డిగ్రీ కళాశాలల అకడమిక్‌ను కొంతకాలంగా ప్రారంభించేవారు. ఇదే విధానం పలు విశ్వవిద్యాలయాలు పాటిస్తున్నాయి. అయితే ప్రభుత్వ కళాశాలలకు తగిన స్థాయిలో అధ్యాపకులు లేని కారణంగా ఏటా అతిథి అధ్యాపకులను నియమించుకునే ప్రక్రియ సాగుతోంది. ఇదంతా సెలవుల కాలంలోనే జరగాల్సిన ప్రక్రియ. కానీ ఉన్నత విద్యాశాఖ జాప్యం కారణంగా ఇప్పటివరకు నియామకపు ప్రక్రియ కొనసాగలేదు. అతిథి అధ్యాపకులు లేకుండా రాష్ట్రంలో డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీల్లో తరగతులు ప్రారంభించే పరిస్థితి లేదు. ప్రతి కళాశాలలోనూ అధ్యాపకుల కొరత 70-90శాతం దాకా ఉంది. కొన్ని యూనివర్సిటీల్లో రెగ్యులర్ అధ్యాపకులు ఒకరిద్దరు మాత్రమే కొనసాగుతున్నారు. వారు హెచ్ఓడీలుగా ఉంటుండటంతో వారు తరగతులకు వెళ్లే పరిస్థితి లేకుండా పోతోంది.


### హైకోర్టు ఆదేశాలతో మరింత జాప్యం

రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, విశ్వవిద్యాలయాలు దశాబ్దాల కాలంగా ఎదుర్కొంటున్న సమస్య అయినా సకాలంలో నియామకపు ప్రక్రియలు సాగలేదు. గెస్ట్ లెక్చరర్ల నియామకాలకు యూజీసీ నిర్ధారించిన విద్యార్హతతో పాటు పలు షరతులు పాటించాలని హైకోర్టు సూచించడంతో అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియ మరింత జాప్యమయ్యే అవకాశం ఉంది. పలు యూనివర్సిటీల్లో సెప్టెంబరు మూడో వారం నుంచే దరఖాస్తులు స్వీకరించారు. 20 రోజుల్లో ప్రక్రియ ముగించాల్సి ఉంది. అయితే యూజీసీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలనే ఆదేశాలు ఉండడంతో అర్హులను ఎంపిక చేయడం సవాల్‌గా మారింది.



### పొంతనలేని టైం టేబుల్

రాష్ట్రంలో 430 డిగ్రీ కళాశాలలు ఉండగా 10,600మంది అతిథి అధ్యాపకులు ఉన్నారు. వీరిలో 5,890 మంది యూజీసీ నిబంధనల మేరకు విద్యార్హత లేనివారు. వీరిస్థానంలో కొత్తవారిని నియమించుకోవాల్సి వస్తోంది. అప్పటివరకు విద్యార్థులు కళాశాలలకు వెళ్లి రావడం మినహా తరగతులు మాత్రం కొనసాగవు. అతిథి అధ్యాపకులు లేనికారణంగా తరగతులపై ప్రభావం చూపనుంది. సాధారణంగా యూజీసీ నియమాల ప్రకారం ఒక సెమిస్టర్‌లో 120 రోజులపాటు తరగతులు కొనసాగాలి. అందుకు తగ్గట్టుగా టైంటేబుల్ పొంతన కుదరడం లేదు. పలు యూనివర్సిటీలు 110 రోజులకు తగ్గించుకున్నాయి. రోజులు తగ్గించుకోవడంతో అధ్యాపకులకే కాకుండా విద్యార్థులపైనా ఒత్తిడి పెరుగుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలల కంటే ఎక్కువగానే ప్రైవేట్ కళాశాలలు, యూనివర్సిటీలు ఉన్నాయి. బెంగళూరు, మైసూరు, బెళగావి, మంగళూరు, ఉడుపి, హోబళి ప్రాంతాల్లో ప్రైవేట్ కళాశాలలు ఎక్కువగా ఉన్నాయి.



ఇప్పటికే ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీలలో తరగతులు ప్రారంభించారు. వృత్తివిద్యా కోర్సులకు సంబంధించి ఇంజనీరింగ్‌లో సీఈటీ ద్వారా సీట్ల కేటాయింపు జాప్యం కావడంతో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు, వివిల లోనూ జాప్యం జరిగింది. అయితే డిగ్రీ కళాశాలలు మాత్రం ప్రైవేట్‌లో నిరంతరం తరగతులు కొనసాగుతుండగా ప్రభుత్వ కళాశాలల్లో ఇంకా ప్రక్రియ ఆరంభం కాలేదు.

### న్యాయసలహా కోరతాం: విద్యాశాఖ మంత్రి సుధాకర్

గెస్ట్ లెక్చరర్ల నియామకాలకు సంబంధించి యూజీసీ నిబంధనలు పాటించాలని హైకోర్టు ఆదేశించడంతో గడిచిన కొన్నేళ్లుగా పనిచేస్తున్న వారిలో 5 వేల మంది అనర్హులవుతారని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. న్యాయ సలహా పొందాలని భావిస్తున్నామన్నారు. యూజీసీ నిబంధనలు పాటిస్తే ప్రస్తుతం గెస్ట్ లెక్చరర్‌లకు ఇస్తున్న వేతనం దాదాపు రెట్టింపు కానుంది. కనీసం రూ. 50వేలకంటే ఎక్కువగానే జీతం చెల్లించాల్సి ఉంటుంది.



# కాంగ్రెస్‌లో... కలకలం

### మంత్రులు పరమేశ్వర్, మహదేవప్ప, సతీశ్‌జార్కిహొళి భేటీ
### మరోమారు తెరపైకి సీఎం మార్పు అంశం..?

**ఉప ఎన్నికలపై చర్చించాం**

**ఈడీ, ముడా అంశాలు చర్చకు రాలేదు**

**సీఎంతోపాటు అందరూ కలిసే ఉన్నాం**

**- మంత్రి సతీశ్‌జార్కిహొళి**

బెంగళూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ముడా వివాదంలో సీఎం సిద్దరామయ్యకు కేసుల కష్టాలు బిగుసుకుంటున్న తరుణంలో మంత్రుల రహస్యభేటీ కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. కారణాలు ఏవైనా రహస్యంగా సమావేశం కావడం పలువురు మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులను విస్మయం కలిగిస్తోంది. బీజేపీ-జేడీఎస్ నాయకులు ముఖ్యమంత్రితోపాటు కాంగ్రెస్ పార్టీకి తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నా వాటి గురించి ఒకరిద్దరు తప్ప మంత్రులెవరూ నోరు మెదపడం లేదు. మరోవైపు రహస్య సమావేశాల వెనుక భారీ అజెండానే ఉన్నట్టు తెలుస్తోంది. తాజాగా మంగళవారం రాత్రి హోం మంత్రి పరమేశ్వర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళిలు భేటీ అయ్యారు. వీరు ప్రస్తుతం కేబినెట్‌లో కీలకమైన మంత్రులు. ఇప్పటికే పరమేశ్వర్ తాను సీఎం రేసులో ఉన్నానని దాదాపు నిరూపించుకున్నారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీతో ప్రత్యేక సమావేశం కావడం, సదరు విషయాలను బహిరంగంగా చెప్పలేనంటూ ప్రకటించారు. మరోవైపు సతీశ్‌జార్కిహొళి ఆగస్టు రెండోవారం తర్వాత నుంచి సెప్టెంబరు రెండో వారం దాకా నాలుగైదుసార్లు ఢిల్లీకి వెళ్లొచ్చారు. ప్రతిసారి పరమేశ్వర్‌తో చర్చలు జరిపాకనే జార్కిహొళి ఢిల్లీ వెళ్లి వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల హోం మంత్రి పరమేశ్వర్, డీసీఎం డీకే శివకుమార్‌లు ప్రత్యేకంగా భేటీ అయిన విషయం మరువక ముందే ముగ్గురు మంత్రుల కలయిక కాంగ్రెస్‌లో కుతూహలం రేకెత్తిస్తోంది. దళిత ముఖ్యమంత్రి అంశం అప్పుడప్పుడు తెరపైకి వస్తున్న విషయం తెలిసిందే. మంత్రి మహదేవప్ప ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అత్యంత ఆప్తుడనే విషయం తెలిసిందే. సిద్దరామయ్యను వీడి మహదేవప్ప రాజకీయం చేసే ఆలోచన లేదనేది ఇప్పటివరకు సాగింది. అయితే సీఎం సిద్దరామయ్యపై లోకాయుక్త విచారణకు ముందే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా రంగంలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. లోకాయుక్త కంటే ముందే సిద్దరామయ్యను ఈడీ విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఆదివారం ముడా వివాదంలో ఫిర్యాదుదారుడు స్నేహమయికృష్ణకు ఈడీ నోటీసులు ఇచ్చింది. గురువారం విచారణకు హాజరు కావాలని కోరింది. మరోవైపు అన్నివైపులా ఒత్తిడి వస్తే సీఎం రాజీనామా అనివార్యం కానుందని పార్టీలోనే గుసగుసలు ఆరంభమయ్యాయి. కాగా ముగ్గురు మంత్రుల భేటీ విషయమై సతీశ్‌జార్కిహొళి మీడియాతో సంచలనమైన అంశాలు ప్రస్తావించారు. ముడా కేసులో సీఎం రాజీనామా చేస్తే తానే ముఖ్యమంత్రి అవుతానని పలువురు మంత్రులు భావిస్తున్నారన్నారు. తమ వద్ద ప్లాన్ ఏ, ప్లాన్ బీలు లేవని డైరెక్ట్‌గా ప్లాన్ సీని అమలులోకి తెస్తామన్నారు. ముగ్గురు భేటీలో ప్రత్యేకతలేదని రాష్ట్రంలోని పలు అంశాలతోపాటు రాబోయే ఉపఎన్నికల గురించి చర్చించుకున్నామని స్పష్టం చేశారు. తమ భేటీలో ఈడీ, ముడా అంశాలు ప్రస్తావనకు రాలేదన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులందరూ కలిసే ఉన్నామని, ఆయనను వదులుకునే ప్రసక్తే లేదన్నారు. కాగా సీఎం రాజీనామా అనివార్యమైతే ఎట్టి పరిస్థితుల్లోనూ డీకే శివకుమార్‌కు అవకాశం లభించకుండా కట్టడి చేసేందుకే ఇటువంటి ప్రయత్నాలు సాగుతున్నట్టు సమాచారం.



పరమేశ్వర్



సతీశ్ జార్కిహొళి



మహదేవప్ప



విద్యుద్దీపాలంకరణలో మైసూరు నగరంలోని కేఆర్ సర్కిల్



చాముండి అమ్మవారు

## దసరా ఉత్సవాలకు సాంస్కృతిక నగరి సిద్ధం

బెంగళూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలకు సాంస్కృతిక నగరి మైసూరు సిద్ధమైంది. గురువారం దసరా ఉత్సవాలు ఆరంభం కానున్నాయి. ప్రముఖ సాహితీవేత్త హంప నాగరాజయ్య దసరా ఉత్సవాలను లాంఛనంగా ఆరంభించనున్నారు. సీఎం సిద్దరామయ్య దసరా ఉత్సవాల ఆరంభం ముఖ్యులుగా పాల్గొంటారు. ఈ మేరకు సీఎం బుధవారం రాత్రి మైసూరుకు చేరుకున్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రముఖులు చాముండి కొండలపైకి చేరుకుంటారు. చాముండేశ్వరి ఉత్సవమూర్తికి పుష్పార్చన చేయడం ద్వారా దసరా ఉత్సవాలను ప్రారంభిస్తారు. కాగా దసరా ఉత్సవాలకు దేశ విదేశీ పర్యాటకులు వస్తున్నందున భారీ భద్రత ఏర్పాట్లు చేసినట్లు మైసూరు నగర పోలీస్ కమిషనర్ సీమాలాట్కర్ తెలిపారు. ఇద్దరు డీఐజీలు, 27 మంది ఎస్పీలతోపాటు 5 వేల మంది పోలీసులు పాల్గొంటారన్నారు. డీసీపీలు ముత్తురాజ్, జాహ్నవి పాల్గొన్నారు.

### ప్యాలెస్‌లో నేటి నుంచి ప్రైవేట్ దర్బార్

ప్యాలెస్‌లో యదువంశ రాజసంప్రదాయానికి అనుగుణంగా వేడుకలు జరుగనున్నాయి. గురువారం వేకువజామున 4.30 గంటలనుంచి యువరాజు ప్రత్యేక పూజలు ఆరంభిస్తారు. 7.45 గంటలకు కంకణాన్ని ధరిస్తారు. ప్రైవేట్ దర్బార్ కొనసాగిస్తారు. మరోవైపు ఎగ్జిబిషన్ సెంటర్ ఏర్పాటవుతోంది. గజరాజుల మావటీలు, వారి కుటుంబీకులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పుష్ప అమరనాథ్ వాయనం అందచేశారు.

## కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో మూడుచోట్ల శ్రమదానం






స్వచ్ఛతపై జాగృతి, మొక్కలు నాటే కార్యక్రమాల్లో పాల్గొన్న కెనరాబ్యాంకు ఉన్నతాధికారులు

బెంగళూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో 'స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత' నినాదంతో బుధవారం మూడుచోట్ల శ్రమదానం చేశారు. బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్‌చంద్ర ఆధ్వర్యంలో ఉత్తరహళ్ళి క్లస్టర్ తురహళ్ళిలో పాదయాత్ర అనంతరం శ్రమదానం చేశారు. శ్రీనివాస కాలనీ, సుబ్రమణ్యనగర్ ప్రాథమి పాఠశాలలో ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్ హర్‌దీప్‌సింగ్ అహ్లూవాలియా ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. పాఠశాలను పరిశుభ్రంగా తీర్చారు. అదే తరహాలోనే బసవనగుడి బీపీ వాడియా రోడ్డులో బాలికల పీయూ కళాశాలలో మొక్కలు నాటారు. మెగా స్వచ్ఛతా కార్యక్రమాన్ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భావేంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగింది. చీఫ్ విజిలెన్స్ కమిషనర్ నబీన్‌కుమార్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. కెనరాబ్యాంకు హెడ్‌ఆఫీస్‌తోపాటు వివిధశాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు సుమారు 300మంది పాల్గొన్నారు. ప్రతి పాఠశాలను శుభ్రం చేయడంతోపాటు మొక్కలు నాటడం, పాదయాత్రల ద్వారా ప్రజలను చైతన్యం చేశారు.

## ప్రాణంమీదకు తెచ్చిన సలహా

### డోర్ వద్ద నిలబడవద్దన్నందుకు బీఎంటీసీ కండక్టర్‌ను పొడిచిన జార్ఖండ్ వాసి

బెంగళూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుడి మంచికోరి కండక్టర్ ఇచ్చిన సలహా ఆయన ప్రాణాలమీదకు తెచ్చింది. డోర్ వద్ద నిలబడవద్దని సలహా ఇచ్చిన కండక్టర్‌ను ఓ యువకుడు కత్తితో పొడవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి వైట్‌ఫీల్డ్‌లోని వైదేహి సర్కిల్‌లో బస్సు ప్రయాణ సమయంలో ఫుట్‌బోర్డ్ వద్ద నిలబడిన ప్రయాణికుడు, జార్ఖండ్‌వాసి హర్షసిన్హాను అక్కడ ఉండవద్దని కండక్టర్ యోగేష్ సూచించాడు. ఇది వారి మధ్య వాగ్వాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో హర్షసిన్హా ఒక్కసారిగా చాకుతో కండక్టర్‌పై దాడి చేశాడు. ప్రయాణీకులు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపైనా గొడవకు దిగాడు. డ్రైవర్ డోర్‌ను ఓపెన్ చేయకపోవడంతో హర్షసిన్హా తప్పించుకోలేకపోయాడు. బస్సు వైట్‌ఫీల్డ్ పోలీస్‌స్టేషన్ సమీపంలోనే ఉండటంతో ఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న పోలీసులు బస్సు వద్దకు చేరుకుని హర్షసిన్హాను అదుపులోకి తీసుకున్నారు. కండక్టర్ వైట్‌ఫీల్డ్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



## తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1631.91 | 1,617.64 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 8,726 | 1,077 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 10,175 | 9,715 |
| సామర్థ్యం (టీఎంసీలు) | 101.42 | 54.96 |

### జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు



ఆటో డ్రైవర్లకు బీజేపీ సభ్యత్వం ఇస్తున్న దృశ్యం

**సిరుగుప్ప, అక్టోబరు 2:** బీజేపీ సీనియర్ నాయకుడు దరప్పనాయక ఆధ్వర్యంలో బీజేపీసభ్యత్వ నమోదు కార్యక్రమం ఊపందుకుంది. పట్టణ బస్టాండు ఎదుట ఆటో డ్రైవర్లకు బీజేపీ సభ్యత్వం ఇచ్చారు. మొబైల్ ఫోన్ యాప్ ద్వారా ఎస్ఎంఎస్ చేయడం ద్వారా సభ్యత్వాన్ని నమోదు చేస్తున్నారు. వందలాది మంది ఆటో డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### శుద్ధరామయ్యగా తిరిగి రావాలి




మాట్లాడుతున్న మాజీ ఎంపీ మునిస్వామి

**బళ్లారి సిటీ, అక్టోబరు 2:** ముడా కేసు విచారణ తర్వాత మీపై ఉన్న అభియోగం క్లియర్ అయితే ముఖ్యమంత్రి శుద్ధ సిద్దరామయ్యగా తిరిగిరావాలని కోలార్ మాజీ ఎంపీ మునిస్వామి అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముడా కుంభకోణంలో ఆయన రాజీనామా కోసం పాదయాత్ర చేశామని, సిద్దరామయ్య మన పాదయాత్రకు కౌంటర్ కార్యక్రమం నిర్వహించారన్నారు. యడ్యూరప్పపై ఆరోపణలు వచ్చినప్పుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారని, ఇప్పుడేమో ఇది వేరు అంటున్నారన్నారు. ఇప్పుడు సిద్దరామయ్య ముఖంలో చిరునవ్వులేదని, రాజీనామా చేయడానికి తానేమీ తప్పుచేయలేదంటున్నారేగాని ఇంకేమీ మాట్లాడటం లేదన్నారు. సైట్ ఎందుకు వాపస్ చేస్తాం? అని అడిగిన ఆయన ఇప్పుడు ఈడీ ఎంట్రీ ఇవ్వగానే వాపస్ చేశారన్నారు. డీనోటిపై విషయంలో ఎవరి దగ్గరకి ఎంత డబ్బు వచ్చిందో అందరికీ తెలిసిందేనని, ముడా కేసులో రూ.5వేల కోట్లకు పైగా కుంభకోణం జరిగిందని, దీనిపై విచారణ జరపాలన్నారు. రాజ్యాంగంపై గౌరవం ఉంటే ముందుగా రాజీనామా చేయాలని, ఓట్ బ్యాంక్ కోసం కులాలమధ్య విషబీజాలు నాటవద్దన్నారు. గణేశ్ ఉత్సవానికి వంద నిబంధనలు పెట్టిన సిద్దూ, టిప్పు జయంతికి నిబంధనలేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యం.సతీశ్, జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు, నాయకులు హనుమంతప్ప, రామలింగప్ప,ఎర్రంగళి తిమ్మారెడ్డి తదితరులున్నారు.

### పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి



స్వచ్ఛతా కార్యక్రమంలో మేయర్ ముల్లంగి నందీశ్

**బళ్లారి సిటీ, అక్టోబరు 2:** పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా జీవించడం సాధ్యమవుతుందని మేయర్ ముల్లంగి నందీశ్ అన్నారు. బుధవారం నగరంలోని హెచ్ ఆర్ గవియప్ప సర్కిల్, బుడా ఆఫీస్ ఆవరణ పార్కులో పరిశుభ్రతా పనులను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్పోరేషన్ సిబ్బంది తెల్లవారుజామున నగర పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొంటారని, పజలు వ్యర్థాలను వేరు చేసి కార్పోరేషన్ వాహనాలకు ఇవ్వాలన్నారు. జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మాట్లాడుతూ.. పరిశుభ్రతే సేవ అని, ప్రతి ఒక్కరూ అంతర్గతంగా, బాహ్యంగా, పరిశుభ్రంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేర్, మున్సిపల్ కార్పొరేషన్ సభ్యులు, పౌరకార్మికులు పాల్గొన్నారు.

# సబ్‌కో సన్మతి దే భగవాన్!

ఘనంగా గాంధీ జయంతి



గంగావతిలో బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

శాంతినికేతన్ విద్యాసంస్థలో..

గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

మహాత్ముడికి పుష్పాంజలి

జేడీయస్ తాయణ్ణ ఆధ్వర్యంలో...

గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎంపీ తుకారాం

కురేకుప్ప పురసభ కార్యాలయంలో..

కంప్లిలో ఊరేగింపులో ఎమ్మెల్యే గణేష్

జిల్లాలో బుధవారం గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారికి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పలుచోట్ల శ్రమదానం చేపట్టారు. పార్లమెంట్ సభ్యుడు తుకారాం మాట్లాడుతూ.. గొప్ప శాంతికాముకుడు, అహింసావాది మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. జిల్లాపంచాయితీ, సమాచార పౌరసంబంధాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సిటీ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న గాంధీభవన్‌లో బుధవారం నిర్వహించిన 155వ జయంతోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేష్ మాట్లాడుతూ, ప్రతి ఒక్క విద్యార్థి గాంధీ తత్వాలను అలవరుచుకుని ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బళ్లారిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో కంప్లి పట్టణానికి చెందిన సాహితీ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో చదువుతున్న సాయిచేతన్ ఈ పోటీల్లో ప్రథమస్థానం దక్కించుకుని ఎంపీ తుకారామ్, జెడ్పీసీఈవో చేతుల మీదుగా అవార్డు అందుకుంది. సిరుగుప్ప పట్టణం నడిబొడ్డున వున్న గాంధీ విగ్రహానికి జేడీఎస్ తాలుకా అధ్యక్షుడు శివనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఆలయాల్లో మహాలయ అమావాస్య పూజలు



ప్రత్యేకాలంకరణలో ఎర్రితాత



సర్వాలంకృతుడైన కుమారస్వామి



ఉలిగమ్మ మాత



బళ్లారి వాసుల ఆరాధ్యదేవత దుర్గమ్మ

**బళ్లారిరూరల్, అక్టోబరు 2 :** తాలుకాలోని వివిధ ఆలయాల్లో బుధవారం మహాలయ అమావాస్య సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో వెలిసిన చెళ్లగుర్కి ఎర్రితాత ఆలయంల బళ్లారి ఇన్‌ఫ్రంట్ రోడ్డులో కుమారస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. బళ్లారి నగర ఆరాధ్యదేవత బళ్లారి కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునిరాబాద్‌లో వెలిసిన ఉలిగమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## తెప్పలతో నది నుంచి ఇసుక అక్రమ తరలింపు



నదిలో ఇసుక కోసం వచ్చిన తెప్పలు

**కంప్లి, అక్టోబరు 2:** తుంగభద్ర నదిలో గంగావతివైపు చిక్కజంతిగల్ ఒడ్డున తెప్పలతో అక్రమంగా ఇసుక తరలింపు జోరుగా సాగుతోంది. అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఆ ప్రాంతంలో ఇసుకను తెప్పలతో తరలించడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ కారణంగా గంగావతిలో హోలీ వేడుకల సమయంలో ఒక బాలుడు ఆ గుంతలోపడి మృతి చెందిన విషయం విదితమే. పగలనక, రాత్రనక తెప్పలతో నదిలో నుంచి ఇసుకను ఒడ్డుకు తరలించి అక్కడి నుంచి ట్రాక్టర్లు, ఎద్దులబండ్లపైన ఇసుకను అవసరమైన చోటుకు రవాణాచేస్తున్నారు. ఇంతజరుగుతున్నా చిక్కజంతిగల్ పంచాయతీ అధికారులు గానీ, అక్కడున్న పోలీసుశాఖ వారుగాని తహసీల్దార్లు గానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇలా చేయడం వల్ల నదిలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో కేవలం గుంతలు వున్న ప్రదేశంలో మాత్రమే నీరు నిల్వ వుంటోంది. నీరు ఎల్లప్పుడూ ఇక్కడే నిల్వ వుండటంతో ముందుభాగంలో వుండే పశువులకు వేసవిలో నీరు కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా తుంగభద్ర నదిలో ఇసుకను తరలించేవారిపై చర్యలు తీసుకుని నదిలో ఎలాంటి గుంతలు ఏర్పడకుండా చూడాలని వివిధ సంఘాల నేతలు కోరుతున్నారు.

### దసరా వేడుకలకు దుర్గమ్మ ఆలయం ముస్తాబు



ముస్తాబైన చిన్నదుర్గాదేవి

**బళ్లారి సిటీ, అక్టోబరు 2:** నగరంలోని చిన్న దుర్గమ్మ ఆలయంలో 9వ సంవత్సర దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహక మండలి అధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గురువారం నుంచి 12వ తేది వరకు దసరా కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. ప్రతిరోజు అమ్మవారికి అభిషేకం, మంగళహారతి, వివిధ అలంకరణలు చేసి సాయంత్రం హోమం నిర్వహిస్తారన్నారు. గురువారం బాల త్రిపుర సుందరి దేవి అలంకారం, మహాగణపతి హోమం,సాయంత్రం 5గంటల నుండి మహిళల వేద మంత్రోచ్చారణలు జరుగుతాయన్నారు. 4న గాయత్రిదేవి అలంకరణ, హయగ్రీవ హోమం, 5న లలితాదేవి అలంకరణ, లలితాదేవి హోమం నిర్వహిస్తారన్నారు. 6న అన్నపూర్ణేశ్వరీదేవి అలంకరణ, ఆదిత్యాది నవగ్రహ హోమం. 7న అర్ధనారీశ్వరీదేవి అలంకరణ, నారసింహ హోమం. 8న లక్ష్మీదేవి అలంకరణ . 9న సరస్వతీదేవి అలంకరణ, 10న దుర్గాదేవి, 11న మహిసాసురమర్దినీదేవి అలంకరణ, 12న దేవి నిజరూప అలంకరణ, పల్లకీ ఊరేగింపు ఉంటాయన్నారు. ప్రతిరోజు సాయంత్రం జానపద గేయాలాపన, ఇంద్రజాలం, నృత్యం, సంగీతం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో ఆలయ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, కృష్ణ, అబకారి హనుమంతప్ప, రమేశ్ పాల్గొన్నారు.

# హోసూరు జోన్

### గాంధీ జయంతి సందర్భంగా పాదయాత్ర




కాంగ్రెస్ ఎంపీ నేతృత్వంలో పాదయాత్ర

**హోసూరు, అక్టోబరు 2:** గాంధీ జయంతి సందర్భంగా తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు కృష్ణగిరి నియోజకవర్గం ఎంపీ గోపినాథ్ నేతృత్వంలో బాగలూరు సర్కిల్ నుంచి, బస్టాండు వరకు పాదయాత్ర చేశారు. కార్యక్రమంల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీనియర్ అడ్మినిస్ట్రేటర్ నీలకంటన్ పాల్గొన్నారు. చిన్నగుట్టలప్ప, మునిరాజ్, ఆదిల్ పన్ను అగ్బర్ సాదిఖాన్, రాజవర్దన్, మంజు, మునికృష్ణన్, అన్బునాథన్ పాల్గొన్నారు.

### ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక నిఘా

**రాయచూరు, అక్టోబరు 2:** నగర సమీపంలో రాయచూరు-హైదరాబాద్ అంతరాష్ట్ర రహదారిపై ప్రమాద నియంత్రణ చర్యలు కట్టుదిట్టం చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఇటీవల నగర సమీపంలోని యరమరస్ వద్ద హైదరాబాద్-రాయచూరు రోడ్డుపై పలు ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.

### మాజీ సీఎంతో తంబిదురై భేటీ



**హోసూరు, అక్టోబరు 2:** అన్నాడీఎంకే సెక్రటరీ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ ఎం.తంబిదురై కేంద్ర ఆర్థిక స్థాయి సమితి సభ్యుడిగా నియమితులయ్యారు. ఆయన బుధవారం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామిని కలిసి ఆశీస్సులు పొందారు

### ఐఎన్‌టియుసీ ఆధ్వర్యంలో గాంధీకి నివాళులు

**హోసూరు, అక్టోబరు 2:** పట్టణంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి, కామరాజ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సభ్యులు.. గాంధీజీ, కామరాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి కుప్పుస్వామి, కృష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు మురళీధరన్, ఉపాధ్యక్షుడు ఆటోబాబు, మున్సిపల్ చైర్మన్ త్యాగరాజన్, మాజీ చైర్మన్ నీలకంఠన్, నిర్వాహకులు కీర్తిగణేశ్, సెల్వం, ఐఎన్‌టీయూసీ మునిరాజ్, కాళీముత్తు, నంబి గణేశన్, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.




గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఐఎన్‌టీయూసీ కార్యదర్శి కుప్పుస్వామి

## 5న కర్ణాటక సంబరం

- విజయవంతం చేయాలని జిల్లాధికారి పిలుపు



సమావేశంలో ప్రసంగిస్తున్నడీసీ నితీశ్

**రాయచూరు, అక్టోబరు 2 :** నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవరణలో ఈనెల 5వ తేదీన గోకాక్ ఆందోళనకు సంబంధించి కర్ణాటక సంబరం-50 పేరుతో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లాధికారి నితీశ్ తెలిపారు. చారిత్రక సమావేశాన్ని విజయవంతం చేయాలని సామాజిక సంస్థల పతినిధులను కోరారు. ఇందుకు సంబంధించి జడ్పీ సమావేశ మందిరంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లాధికారి మాట్లాడుతూ.. గోకాక్ ఆందోళనకు ముందు, అనంతరం అనే శీర్షికతో నిర్వహిస్తున్న చర్చలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. గోకాక్ ఆందోళనలో పాల్గొన్న అనేక మంది పోరాటయోధులు ఈ సమావేశానికి హాజరుకానున్నారన్నారు. పోరాటాన్ని విజయవంతం చేసిన సీనియర్లను ఈ సందర్భంగా సన్మానించనున్నట్లు జిల్లాధికారి తెలిపారు. కర్ణాటక సంబరం-50 పేరుతో నిర్వహించే ఈ సమావేశాల్లో గోకాక్ ఆందోళనతో సంబంధం ఉన్న ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు.

### కంప్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేకపుష్పాలంకరణలో కాళికాదేవి

**కంప్లి, అక్టోబరు 2 :** అమావాస్య సందర్భంగా కంప్లి పట్టణంలో పలు చోట్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. షుగర్ ఫ్యాక్టరీలోని కాళికాదేవి అమ్మవారికి ఆకుపూజ, ప్రత్యేక పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే సన్నాపురంలోని వీరభద్రేశ్వర ఆలయంలో స్వాముల వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కంపిలోని కాళికా టముటేశ్వరి ఆలయంలో విశ్వకర్మసమాజం ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు.

#### మొదటి స్థానం దక్కించుకున్న సాయి చేతన్

మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బళ్లారిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో కంప్లి పట్టణానికి చెందిన సాహితీ అంగ్లమాధ్యమ పాఠశాలలో చదువుతున్న సాయిచేతన్ ఈ పోటీల్లో ప్రథమస్థానం దక్కించుకుంది. పాఠశాల వ్యవస్థాపకురాలు స్వప్న మాట్లాడుతూ ప్రతి పోటీల్లో విద్యార్థులు వారి ప్రతిభను కనబరిచేందుకు తమ శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. ఓటమి, గెలుపులను రెండింటినీ సమానంగా తీసుకోవాలన్నారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

### గోరా శాస్త్రి (జయంతి)




పత్రికారంగంలో గోరా శాస్త్రిగా గుర్తింపు పొందిన గోవిందుని రామ శాస్త్రి 1919 అక్టోబరు 3న ఒరిస్సా రాష్ట్రం కోరాపుట్టి జిల్లా తేరామాళ్ గ్రామంలో జన్మించారు. జర్నలిజంలోకి రాకముందు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. తెలుగు, ఆంగ్ల భాషా పత్రికల్లో సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించారు. సంపాదకీయాలతోపాటు తెలుగులో అనేక ప్రక్రియల్లో ఫలవంతమైన ప్రయోగాలు చేశారు. కథలు, గల్పికలు, అనేక వ్యాసాలు రాశారు. వందలాదిమంది కొత్త రచయితలను పరిచయం చేశారు. సుమారు వంద శ్రవ్య నాటికలు రాయడంతోపాటు మద్రాసు నుంచి రేడియో నాటికల ప్రత్యేకత సాధించారు. అంతేకాక హైదరాబాద్ రేడియో చర్చల్లో పాల్గొన్నారు. 'ఆశ ఖరీదు అణా' అనే కథకు పాఠకుల మన్ననలు పొందారు. 1982 మే 1న తుదిశ్వాస వీడారు.

### డాక్టర్ వేదవ్యాస (వర్ధంతి)



డాక్టర్ ఎక్కిరాల వేదవ్యాస 1934 ఆగస్టు 13న బాపట్లలో జన్మించారు. భారతీయ సంస్కృతి సముద్ధరణ సంస్థ వ్యవస్థాపకుడు. విద్యావేత్త, విశ్రాంత ఐఏఎస్ అధికారి. అంతేకాక వివిధ నూతన ఆలయాల ఏర్పాటులో కృషి చేశారు. రచయిత, యోగా గురువుగా రాణించారు. ఆధ్యాత్మిక పరిశోధకులుగా తెలుగు, ఆంగ్లంలో 150కుపైగా పరిశోధనా గ్రంథాలు రచించారు. భక్తి సంబంధ ఉపన్యాసాలు చేశారు. శుభ వార్త అనే ఆధ్యాత్మిక మానసపత్రికను 1975 నుంచి నిర్వహించారు. 2007 అక్టోబరు 3న పరమపదించారు.

### సత్యరాజ్ (పుట్టినరోజు)



దక్షిణాది ప్రముఖ నటుడు సత్యరాజ్ 1954 అక్టోబరు 3న కోయంబత్తూరులో జన్మించారు. అసలు పేరు రంగరాజ్ సుబ్బయ్య. ప్రధానంగా తమిళంలో రాణించినా తెలుగు, మళయాళం, కన్నడ, హిందీ భాషల్లో 240కుపైగా సినిమాల్లోనూ నటించి గుర్తింపు పొందారు. నటుడిగానే కాక నిర్మాత, దర్శకుడిగా వ్యవహరించారు. ప్రత్యేకించి 'బాహుబలి'లో 'కట్టప్ప' పాత్ర ఆయనకు జాతీయ గుర్తింపు తెచ్చింది. ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, ఐఐఎఫ్ఏ అవార్డులు, తమిళనాడు రాష్ట్ర ఫిల్మ్ అవార్డులు, కళైమామణి, గౌరవ డాక్టరేట్ ఇతర పురస్కారాలు అందుకున్నారు.

# గాంధీజీ ఆశయాలు అనుసరణీయం



బాగేపల్లి తాలూకాలో గాంధీజీకి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



మేలూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో...



గాంధీజయంతిలో పాల్గొన్న బొమ్మనహళ్ళి నియోజకవర్గ నాయకులు

**ఘనంగా బాపూ జయంతి**

**బెంగళూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని బీజేపీ, జేడీఎస్ ప్రధాన కార్యాలయాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో గాంధీజీ జయంతిని అర్థవంతంగా ఆచరించారు. ఆయా పార్టీల కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బంగారపేటలో..

**బంగారపేట, అక్టోబరు 2:** మహాత్మాగాంధీ సత్యం, అహింస వంటి ఆదర్శాలు, గ్రామాల అభివృద్ధియే దేశాభివృద్ధి అనే ఆయన ఆశయాలు నేటికీ అనుసరణీయమని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకా కార్యాలయంలో బుధవారం ఏర్పాటైన గాంధీ జయంతి, లాల్‌బహద్దూర్ శాస్త్రిల జయంతిలో పాల్గొని వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అహింస, సత్యం, ధర్మం అనే అంశాలతో పోరాడి స్వాతంత్ర్యాన్ని సాధించిన నాయకుడన్నారు. గాంధీజీ బోధనలు లక్షలాదిమందిలో చైతన్యం తెచ్చాయన్నారు. అస్పృశ్యతను ఖండించడమే కాక ఖద్దరుకు ప్రాధాన్యత ఇచ్చి చేనేత రంగానికి ఊతమిచ్చారన్నారు. సమాజంలో మార్పుకోసం శ్రమించారన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ద్వారా స్ఫూర్తి పొందాలన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవిందరాజు, పురసభ ఉపాధ్యక్షురాలు చంద్రవేణి మంజునాథ్, సభ్యులు వెంకటేశ్, షఫీ, సాదిక్, ప్రశాంత్, ఆజామ్ తదితరులు పాల్గొన్నారు.

### శిడ్లఘట్టలో..

**శిడ్లఘట్ట, అక్టోబరు 2:** తాలూకాలోని మేలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీజయంతిని, లాల్‌బద్దూర్ శాస్త్రిల జయంతిని బుధవారం సరళంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. స్వాతంత్ర్య స్వంగ్రామంలో వారి సేవలను వక్తలు కొనియాడారు. దేశభక్తి పెంపొందించే కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. గ్రామ పెద్దలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

### బాగేపల్లిలో...

**బాగేపల్లి, అక్టోబరు 2:** స్వచ్ఛతా అభియాన కేవలం భౌతికంగా ఆచరిస్తే చాలదని ఇంటితోపాటు మనస్సు, కుటుంబం, సమాజం, దేశం కూడా స్వచ్ఛత అయినప్పుడే మహాత్మాగాంధీజీ కలలు సాకారమవుతాయని, రామరాజ్యం పరికల్పన సఫలం కానుందని, సరళమైన బతుకు భాగం కాగావాలని ఘంటంవారిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి రామసుబ్బమ్మ అభిప్రాయపడ్డారు. పాఠశాల ఆవరణలో బుధవారం స్వచ్ఛతా అభియానకు శ్రీకారం చుట్టారు. స్కూల్ అసిస్టెంట్ కేటీ అంజనేయరెడ్డి, జీవీ చంద్రశేఖర, ఎల్ రవి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

### విజయపురలో..

**విజయపుర, అక్టోబరు 2:** ఇండో టిబెటియన్ బార్డర్ పోలీస్ ఫోర్స్ కేవలం సరిహద్దులలో కాపలా కాయడమే కాదని దేశంలో స్వచ్ఛతతోపాటు ప్రకృతి వైపరీత్యాల వేళ ప్రజలను ఆదుకోవడంలో ముందంజలో ఉంటుందని ఐటీబీపీ సుంద్రహళ్ళి విభాగం సహాయక కమాండెంట్ శబనం పాటియల్ అభిప్రాయపడ్డారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా 15 రోజులపాటు శుభ్రతే సేవ అనే కార్యక్రమంలో పాల్గొనేవారన్నారు. కార్యక్రమంలో ఐటీబీపీ అధికారులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### బొమ్మనహళ్ళిలో...

**బొమ్మనహళ్ళి, అక్టోబరు 2:** కేపీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటైన పాదయాత్రలో బొమ్మనహళ్ళి నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో నాయకులు పాల్గొన్నారు. గాంధీజీకి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో బెళగావి సమావేశంలో మహాత్మాగాంధీజీ పాల్గొని వందేళ్లు పూర్తైన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం సాగింది. హెచ్ఎస్ఆర్ లే అవుట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, బొమ్మనహళ్ళి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవీంద్ర, బిలేకహళ్ళి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశ్వత్థనారాయణస్వామిలు ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి చేరుకున్నారు. స్థానిక వార్డు కార్యాలయాలలోనూ మహాత్మాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. శాంతి, సహనం వంటి గాంధీ మార్గంలో కొనసాగాలని వాసుదేవరెడ్డి అభిప్రాయడాడ్డారు. కార్యక్రమంలో కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పలుచోట్ల గాంధీ జయంతి కార్యక్రమాలు సాగాయి.



తాలూకా కార్యాలయంలో గాంధీజయంతిలో ఎమ్మెల్యే తదితరులు



విజయపురలో ఐటీబీపీ అధికారులు

## భార్యాభర్తల గొడవే రోజంతా ప్రసారమా..?

» ఇది నైతిక జర్నలిజమా - సీఎం ఆక్రోశం

**బెంగళూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి):** భార్యాభర్తల గొడవను రోజంతా ప్రసారం చేస్తారని ఇది నైతికమైన జర్నలిజమా అంటూ సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. ఊహాజనితమైన కథనాలు పెరిగిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. సమాచారశాఖ ఆధ్వర్యంలో బుధవారం మహాత్మాగాంధీ సేవా పురస్కారం, టీఎస్ఆర్, మొహర్ హనుమంతరాయ పత్రికారంగ పురస్కారాలను సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఊహాజనితమైన కథనాలు ఎక్కువన్నారు. వారు ఏదో చెప్పారు, మీ సమాధానం ఏంటని మొహంమీద మైక్ పెట్టి నిలదీస్తారన్నారు. ఇలాంటి విధానం నాకు అర్థం కావడం లేదన్నారు. గతంలో పాత్రికేయులకు ఎంతో గౌరవం ఉండేదని ఇప్పుడు ఉందా అంటూ విశ్లేషించుకోవాలన్నారు. విశ్లేషణలను వివాదాలు చేస్తున్నారన్నారు. 2014లో తొలిసారి సీఎం అయినప్పుడు మహాత్మాగాంధీ సేవా పురస్కారాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్, సీఎం మీడియా సలహాదారుడు ప్రభాకర్, మీడియా అకాడమీ చైర్మన్ ఆయేషాఖానం తదితరులు పాల్గొన్నారు. ఎంపిక చేసిన ప్రముఖ పాత్రికేయులకు పురస్కారాలు ప్రదానం చేశారు.

### మునిరత్న ఇంట్లో లభించిన

## పెన్‌డ్రైవ్‌లో ప్రముఖుల ప్రైవేట్ వీడియోలు

**బెంగళూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి):** కులదూషణతోపాటు లైంగిక దౌర్జన్యం ఆరోపణలతో అరెస్టు అయిన రాజరాజేశ్వరినగర్ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న నివాసంపై సెప్టెంబరు 28న సిట్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆయన ఇంటితోపాటు సుమారు 15చోట్ల దాడులు జరిపిన పోలీసులు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఓ ల్యాప్‌టాప్‌తోపాటు పెన్‌డ్రైవ్‌లలో బీజేపీతోపాటు ప్రముఖ రాజకీయ నాయకులకు చెందిన ప్రైవేట్ వీడియోలు ఉన్నట్టు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ వీడియోలు హనీట్రాప్ ద్వారా చిత్రీకరించి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దురుద్దేశ్యపూర్వకంగానే వీటిని చిత్రీకరించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ కోణంలో విచారణలు జరపదలిచినట్టు సమాచారం.



ఎమ్మెల్యే మునిరత్న

## రాష్ట్రమంతటా పితృపక్ష పూజలు

**బెంగళూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి):** హిందూ సంప్రదాయంలో భాగంగా పితృపక్ష పూజలు రాష్ట్రమంతటా జరుపుకొన్నారు. పితృపక్ష పూజలు రాష్ట్రంలో ప్రతి ఏటా ఆచరించే సంప్రదాయం దశాబ్దాలుగా ఉంది. ఏటా భాద్రపద మాసం కృష్ణపక్షాన్ని పితృపక్షాలుగా పిలుస్తారు. 15రోజులపాటు పూర్వీకులను స్మరించుకుంటారు. మహాలయ అమావాస్య రోజున ప్రత్యేక పూజలతో కొలిచే సంప్రదాయం ఉంది. పూర్వీకులను స్మరించుకోవడం ద్వారా ఆయుష్షు, సంతానం, యశస్సు లభిస్తుందని భావిస్తారు. తరతరాల పూర్వీకుల పేర్లతో తర్పణాలు వదులుతారు. ఇలా ప్రతి ఇంట పితృపక్ష పూజలు జరిగాయి. కాలభైరవేశ్వర ఆలయంతోపాటు పలు చోట్ల ప్రత్యేకంగా ధార్మిక కార్యక్రమాలు జరిపారు.



తర్పణ కార్యక్రమంలో ఇలా..



చిక్కపేటలోని ఓ ఆలయంలో ప్రత్యేకపూజల్లో భక్తులు

### పట్టణంలో సామూహిక తర్పణాలు

**చేళూరు, అక్టోబరు 2:** తాలూకా కేంద్రమైన చేళూరు పట్టణంలో మహాలయ అమావాస్యను పురస్కరించుకుని బ్రాహ్మణసంఘం భవనంలో బుధవారం సామూహిక తర్పణ కార్యక్రమాలు సాగాయి. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి బ్రాహ్మణులు పెద్దసంఖ్యలో పాల్గొని తమ పూర్వీకులకు తర్పణాలు సమర్పించారు. సంఘం అధ్యక్షుడు నాగభూషణ స్వామి మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాల కార్యక్రమాలకు సంఘం ఇతోధికంగా ప్రోత్సహిస్తోందన్నారు.

## ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు

**బొమ్మనహళ్ళి, అక్టోబరు 2:** సర్జాపుర ప్రాంతం వర్తూరు రోడ్డులో బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోనూ కార్యక్రమాలు సాగాయి. బతుకమ్మ వలంటీర్స్ బృందం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల సందర్భంగా పలు కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు మహాత్మాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పల్లవి, ప్రీతి, సునిత, మాలతియాదవ్, సీత, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

### రేణుకాస్వామి హత్యకేసులో...

## ముగ్గురు జైలు నుంచి విడుదల

**బెంగళూరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి):** చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్‌తో పాటు వివిధ జైళ్లలో గడుపుతున్న వారిలో ముగ్గురు విడుదలయ్యారు. 15వ ఆరోపితుడు కార్తీక్, 16వ నిందితుడు కేశవమూర్తి, 17వ నిందితుడు నిఖిల్‌లు తుమకూరు జైలునుంచి బుధవారం విడుదలయ్యారు. వీరికి పదిరోజులక్రితం బెయిల్ మంజూరైనా పలు కారణాలతో జాప్యం జరిగింది. జైనుంచి బయటకు వచ్చిన వారు మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు.

## కేటురెడ్డీ.. నీ గుట్టు విప్పుతా..

### మంత్రి సత్యకుమార్ ట్వీట్

**ధర్మవరం, అక్టోబరు 2:** మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎక్స్ (గతంలో ట్విట్టర్) ద్వారా బుధవారం ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు. 'కబ్జా, కమీషన్, కలెక్షన్, కరప్షన్‌కు కేరాఫ్ అడ్రస్ కేటురెడ్డి. కమీషన్లు లేక మైండ్ బ్లాక్ అయినట్లు ఉంది. కాస్తా ఓపిక పడితే కేతిరెడ్డి, అతడి రౌడీమూకలు చేసిన దారుణాలు, దౌర్జన్యాలు, నేరాలు, ఘోరాల గుట్టు విప్పుతా. ఇప్పటివరకు చూసింది ట్రైలర్ మాత్రమే. అసలు సినిమా ముందుంది. ఎందుకు తొందరపడుతున్నావు, ఇంటర్వెల్‌లోనే రాజకీయ సన్యాసానికి సిద్ధంగా ఉండు' అంటూ ట్వీట్ చేశారు. పచ్చ కామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందన్న సామెత కేతిరెడ్డికి చక్కగా అతుకుతుందంటూ చురకలు అంటించారు.

## నేటి నుంచి విత్తనాల కోసం రిజిస్ట్రేషన్

**అనంతపురం అర్బన్, అక్టోబరు 2:** సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు గురువారం నుంచి స్థానిక రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాకు 27139 క్వింటాళ్ల పప్పుశనగ కేటాయించారన్నారు. ఇందులో అనంతపురం డివిజన్‌కు 670 క్వింటాళ్లు, కళ్యాణదుర్గం డివిజన్‌కు 2300, రాయదుర్గం డివిజన్‌కు 5400, గుత్తి డివిజన్‌కు 2వేలు, తాడిపత్రి డివిజన్‌కు 8100, ఉరవకొండ డివిజన్‌కు 6900 క్వింటాళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ సారి పప్పుశనగ జేజీ-11 రకం క్వింటా పూర్తి ధర రూ.9400గా నిర్ణయించారన్నారు. ఇందులో 25 శాతం సబ్సిడీపోను రైతు వాటా కింద క్వింటా పప్పుశనగకు రూ.7050లు చెల్లించాలన్నారు. అర ఎకరాకు ఒక ప్యాకెట్(20 కిలోలు) చెప్పున 5 ఎకరాల వరకూ 10 ప్యాకెట్లు పంపిణీ చేస్తామన్నారు.

## అవిశ్రాంత అక్రమాలు

### మైనింగ్ శాఖలో వైసీపీ భక్తుడు

### ప్రభుత్వం తొలగించమన్నా.. కొనసాగింపు

**అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 2:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విశ్రాంత అధికారి అక్రమ వ్యవహారాలకు అడ్డేలేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక విశ్రాంత తహసీల్దార్లు ఎక్కడా పనిచేయకూడదని ఆదేశించింది. ఎక్కడైనా పని చేస్తుంటే వెంటనే తొలగించాలని మూడు నెలల క్రితం ఆదేశించింది. దాదాపు జిల్లా అంతటా ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేశారు. భూగర్భగనుల శాఖలో మాత్రం అమలు చేయలేదు. గత ప్రభుత్వంలో మైన్స్ అక్రమార్కులకు సహకరించిన ఓ విశ్రాంత తహసీల్దారును ఇంకా కొనసాగిస్తున్నారు. ఎవరి అండతో కొనసాగుతున్నారనే చర్చ జరుగుతోంది. అమిగోస్ మినరల్స్, జేపీ వెంచర్స్, ప్రతిమ సంస్థలకు ఆయన పూర్తి సహకారం అందించారు. రెవెన్యూ లొసుగులను మైన్స్ అధికారులకు అనుకూలంగా మలచడంలో ఆయన కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి.

**భారీగా అక్రమాలు**

రాయదుర్గం తహసీల్దారుగా ఆయన నాలుగేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. రెండున్నరేళ్ల క్రితం మైన్స్ శాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధుల్లో చేరారు. అప్పటి మైన్స్ అధికారులు, వైసీపీ నేతలతో ఉన్న సాన్నిహిత్యంతో అక్రమాలకు తెరలేపారు. ఇసుక అక్రమ రవాణా, అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ అక్రమ వసూళ్లకు ఈ విశ్రాంత అధికారి అనుభవాన్ని అందించారు. దీంతో వైసీపీ నేతలు రూ.కోట్ల అక్రమాలకు పాల్పడ్డారు. అమిగోస్‌తో పాటు ఇసుక కాంట్రాక్ట్ పొందిన జేపీ వెంచర్స్, ప్రతిమ సంస్థలకు ఆయన ఊడిగం చేశారన్న తీవ్ర విమర్శలు వచ్చాయి. వైసీపీపై ఉన్న అభిమానాన్ని ఇలా చాటుకున్నారని ఆరోపణలు వచ్చాయి. జగన్ భజన చేసే ఆయన.. కూటమి ప్రభుత్వం వచ్చినా వైసీపీకి అనుకూలంగానే వ్యవహరిస్తున్నారని సమాచారం. అమిగోస్ సంస్థ జిల్లాలో ఏర్పాటు చేసిన 76 చెక్ పోస్టులలో అక్రమ వసూళ్ళు, మైనింగ్ కాంట్రాక్ట్ లీజుదారుల నుంచి బలవంతపు జరిమానాల వసూళ్లకు పాల్పడిన ఘటనలలో ఆయనే కీలకపాత్రధారి అని ప్రచారం ఉంది.

## చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

### నగదు, బంగారు ఆభరణాల స్వాధీనం

**తాడిపత్రి, అక్టోబరు 2:** మండల పరిధిలోని ఇగుడూరులో వారం క్రితం జరిగిన దొంగతనం కేసులో దాసరి నరేంద్ర అలియాస్ కొక్కి, పిల్లెల భైరవుడును పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2.50 లక్షల విలువగల బంగారం, రూ.95 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ రామకృష్ణుడు తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇగుడూరుకు చెందిన నారాయణస్వామి, మొలక సూర్యనారాయణ, శీలం కృష్ణమూర్తి ఇళ్లల్లో వారం క్రితం చోరీ జరిగిందని ఆయన తెలిపారు. ఇళ్లకు తాళం వేసి ఊరికి వెళ్లిన సమయంలో అదే గ్రామానికి చెందిన దాసరి నరేంద్ర ఇంటిపైకి ఎక్కి గవాక్షం గుండా లోపలకి ప్రవేశించి దొంగతనం చేశాడని తెలిపారు. వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడ్డాడని, సులువుగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలను మార్గంగా ఎంచుకున్నాడని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ శివగంగాధర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారని తెలిపారు. దాసరి నరేంద్రను అరెస్టు చేసి విచారించామని, చోరీ చేసిన సొమ్మును తన మేనమామ, కడప జిల్లా ఆర్ఎస్ కొండాపురం మండలం యనమచింతల గ్రామానికి చెందిన పిల్లెల భైరవుడు వద్ద దాచిపెట్టేవాడని తెలిపారు. దీంతో పిల్లెల భైరవున్ని కూడా అరెస్టు చేశామని తెలిపారు. వారం రోజుల్లోనే కేసును ఛేదించిన రూరల్ సీఐ, ఎస్ఐ కాటయ్య, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

# అలరించిన దంతవేదాంతం





నృత్యం చేస్తున్న బాలవికాస్ విద్యార్థులు, నాటికలోని సన్నివేశం

**పుట్టపర్తి, అక్టోబరు 2**

తెలంగాణలోని మహబూబ్‌నగర్‌కు చెందిన భక్తులు బుధవారం సాయంత్రం స్థానిక సాయికుల్వంత్ సభామండపంలో దంతవేదాంతం నృత్యరూపకం ద్వారా భక్తులను అలరింపజేశారు. సత్యసాయి బోధనలు, ప్రేమతత్వాన్ని తెలియజేస్తూ భక్తిపాటలు ఆలపించారు. అష్టోత్తర శతనామావళి పేరిట సత్యసాయి నామావళిని పఠించారు. భక్తులకు సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.